# వొక మైనారిటీ కథ

నన్నూరు రహీంసాహేబ్:

పదిగంటలకు ఆఫీసుకెళ్ళి అటెండెన్సు రిజిష్టరులో సంతకంచేశేశాక, సూపరిండెంటు దగ్గర పర్మిషను తీసుకుని, ఆదరాబాదరాగా స్కూటర్ నడిపి, మా వీధికి తిరిగొచ్చి, గబగబా కార్నర్ హోటలుకెళ్ళి, వోమూలగా కుర్చీలో కూర్చున్నాకగానీ నా ప్రాణం కుదుటపడలేదు. టీ బాయిలర్ ముందు నిల్చున్న గడ్డమాయన "ఛాయ్? యా కాఫీ?" అని అడిగాడు. వురుకులు పరుగులపైన రావడం వల్ల నాకింకా గసలు తన్నుకొస్తున్నాయి. కాస్సేపు ఆగమన్నట్టుగా అతడికి సైగ చేశాక, మాయింటికేసి తిరిగిచూశాను.

మాయింటి తలుపులు వోరగావేసివున్నాయి. గొళ్ళానికి తాళంవేలాడడం లేదంటే రేష్మాయింట్లోనే వున్నట్టులెక్క! 'యా అల్లా!' అని గొణుక్కుంటూ నిట్టూర్చాను. యిటీవలే సిమెంటు గచ్చుతో పైకో అడుగుదాకా వుబికిన వీధిలో జనమెవరూ లేరు. రెండు ఆటోలు వొకదాన్నొకటి తరుముకుంటున్నట్టుగా పరిగెత్తుతున్నాయి. వీధిమలుపు దగ్గర కూరగాయల బండి వాడొకడు యిళ్ళలోపలుండే మనుషుల చెవులు గుయ్యిమనేలా కూరగాయల పేర్లు గట్టిగా అరుస్తున్నాడు.

మాయింటి గడప పైనున్న ఫోటో కనబడుతోంది గానీ, దానిలోని మక్కామసీదు బొమ్మమాత్రం దూరం నుంచీ కనిపించడం లేదు. యింతలో మాయింటి తలుపులు తెరుచుకున్నాయి. బయటి కొచ్చినిల్చున్నాక రేష్మా వీధినంతా గాలిస్తున్నట్టుగా చూస్తోంది. బురఖాలేకుండా బయటకు రావద్దని యెన్నిసార్లు చెప్పాను? నాకు వొళ్ళు మండిపోయింది. పెదవులు కొరుక్కుంటూ కోపాన్ని అణచుకోవడానికి ప్రయత్నించాను. రెండునిముషాల తర్వాత రేష్మా యింటిలోపలికి వెళ్ళిపోయింది.

"ఛాయ్‌సాబ్...." హోటలతను నాకేసి అనుమానంగా చూస్తున్నాడు.

"లావ్" అన్నాను. యింకా అతను నాకేసి అదోలా చూస్తున్నాడు. "మాది యీవీధేలే! వొకదోస్త్ వస్తానన్నాడు. యీ హోటలు అడ్రస్సు యిచ్చాను" అన్నాను. అతను తలవూపుతూ గాజుగ్లాసులు కడుక్కోసాగాడు.

మాయింటి తలుపులకు వెనక నుంచీ గడియపడినట్టుగా అనిపిస్తోంది. సిగరెట్టు వెలిగించుకుని, కుర్చీలో వెనక్కువాలాను. నా భార్య పైన నేనే యిలా గూఢచారిగా పనిచేయాల్సిరావడంకంటే దురదృష్టమింకేముంది చెప్పు! అనుమానమన్నది రానేరాగూడదు. వచ్చిందా, యికపోదు. యెన్నిసార్లు యెన్ని రకాలుగా చెప్పాను రేష్మాకు! మొదట్లో నా మాట వింటోందనే నమ్మాను. కాని ఆ రోజలా వేపమాను వీధిలో రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాక నా అనుమానం రెట్టింపయిపోయింది. ఆ వీధిలో వో అంగడిలోకూర్చుని లెక్కలేవో యినస్పెక్ట్ చేస్తున్నాను. యెదురుగ్గా వున్న గుడిలోంచీ బయటికొస్తూ కనిపించింది రేష్మా. యింటికెళ్ళినిలదీసి అడిగేసరికి మాట్లాడకుండా యేడవబోయింది. యీ ఆడవాళ్ళతో యిదే తలనొప్పి! తప్పులు చేసేదీవాళ్ళే! యిదేమని అడిగితే యేడ్చి ఆగడం చేసేదీవాళ్ళే! చూసిన వాళ్ళు యీ మొగుడు కొట్టికొరతేసినట్టున్నాడనుకుంటారు.

హోటలతను టీగ్లాసును దబ్బున నాముందుపెట్టేసి వెళ్ళిపోయాడు. చాయ్ పెదవులకు వేడిగా, నాలుకకు తీయగా తగిలింది. చిరుచేదుగా లోపలికొస్తున్న సిగరెట్టు పొగలమధ్య చాయ్ రకరకాలుగా రుచిని మార్చుకుంటూ సుళ్ళు తిరుగుతోంది. యింతబాగా టీ చేయడం యీ యిరానీ హోటలు వాళ్ళకు తప్ప మరొకరి చేతగాదు. చిన్నప్పుడు చాయ్‌కావాలని మారాంచేస్తే మా అమ్మ కొట్టులోంచీ పదిపైసల టీపొట్లం తెప్పించి తయారుచేసి యిచ్చేది. కానీ అది యెదురింటి మస్తాన్ వలీ సాహేబు యింట్లోవున్నంత రుచిగా యెప్పుడూ వుండేదిగాదు. చాయ్ మాత్రమేగాదు, పరోటాలూ, సేమియాలూ, వాళ్ళింట్లో వున్నంత రుచిగా మాయింట్లో చచ్చినా కుదిరేవిగాదు. యెప్పుడైనా పట్టుబడితే మా అమ్మ వెజిటబుల్ బిర్యానీ చేసేది. అది యెదురింటి మటన్ బిర్యానీ ముందు దేనికీ పనికిరాదు. అసలు మావూరెప్పుడైనా వచ్చావా నువ్వు! తిరుపతి నుంచీ మదనపల్లె కెళ్ళే రోడ్డును చిత్తూరు నుంచీ కడపకెళ్ళే రోడ్డు చీల్చేచోటుకు పదికిలోమీటర్ల దూరంలో వుంది మావూరు. చుట్టూకొండలు. మధ్యలో పారే వంక. వంకగట్టుపైన రోడ్డు నానుకుని పొడుగ్గా పెరిగిన వూరు. వూరికి పడమటివైపున గుట్టపైన దర్గా. గుట్టకింద కబరస్థాన్. వూర్లోకి రాకముందే దూరం నుంచీ కనిపించే పెద్ద యేక్‌మినార్. ఆ మసీదు వూర్లో మెయిన్ రోడ్డులోనే వుంది. రోడ్డుకు రెండువైపులా మూడు ఫర్లాంగులదూరం వరకూవూరు. రోడ్డు నుంచీ వుత్తరం వైపుకూ, దక్షిణంవైపుకూ వీధులు పాకుతూంటాయి. మెయిన్ రోడ్డుకు రెండువైపులా

వుండే యిండ్లలో నాలుగైదు తప్పితే, మిగిలినవన్నీ ముస్లిముల కుటుంబాలే! రాముడిగుడివీధిలో మరోపది హిందువుల యిండ్లుండేవి. అంతే! మిగిలిన వూరు మొత్తం ముస్లిములయిండ్లే!

వుదయం అయిదు గంటలకు మసీదులో హజాయించేటప్పుడు నిద్రలేవడం మా అమ్మకలవాటు. మధ్యానం హజాయిస్తూంటే భోజనం వేళయిందని అర్థం. సాయంత్రం స్కూలునుంచీ తిరిగొస్తూండగా అయిదు గంటల హజా వినిపించేది. రంజాను నెలలో పొద్దున నాలుగున్నర గంటలకంతా వీధిలో పకీర్లు తిరుగతూ "సహర్ కా వక్త్ హోగయా! జాగో!" అని చాటింపు చెప్పడం యింకా నా చెవుల్లో గింగురు మన్నట్టే వుంటుంది. పక్కింటి కుర్రాడితో కలిసి మసీదుకెళ్ళాలని పట్టుబట్టి నప్పుడు మా అమ్మ దగ్గర దెబ్బలు తినడమే నాకు జ్ఞాపకమున్న బాల్యస్మృతులలో మొదటిది.

"బుద్దుందా లేదానీకు? మసీదుకెళ్ళేందుకు నువ్వేమైనా సాయిబా?" అని మా అమ్మకేకలేసింది.

"నేను సాయిబుగాదా? అయితే యింకెవురు?" అని అడిగానట నేను యేడుస్తూనే.

"బంగారట్లా కోమట్ల యింట్లో పుట్టి, యీ మాదిరిగా సాయిబులబుద్దులు తెచ్చుకోవడవేం ఖర్మరా నాయినా! యీపాడూ తురకల వూర్లో వుండడవే తప్పయిపొయ్యిందే!" అంటూ మా అమ్మ నానా రభస చేసిందట! అప్పుడు మానాయన "కొంచెంగొంతు తగ్గించే! యిప్పటికే ఆ తురకోళ్ళు మన అంగిట్లో సామాన్లు కొనేది తగ్గించేసినారు" అని కసిరాడట!

అయినా మానాయన కొట్లో యెప్పుడూ యీగలే ముసిరేవి. దాన్ని అంగడని పిలవడమే తప్పు. మెయిన్‌రోడ్డుపక్కనుండే యిండ్లన్నీ వుమ్మడిగోడలతో వరసగావుండేవి. మా యిల్లు పన్నెండడుగుల వెడల్పుతో పొడుగ్గా రోడ్డుపైన్నుంచీ వెనకుండే సందువీధి దాకా సొరంగంలాగుండేది. యింటి ముందుండే వరండానే అంగడి. యింటి లోపలికెళ్ళే సన్నటి సందు పక్కనుండే చిన్నగదే దానికి స్టోర్రూం. వరండాలో గోడపక్కన నిలబెట్టిన చెక్క అరలూ, గల్లా పెట్టెముందుండే పదిపదిహేను డబ్బాలూ, వాటికవతల రెండు మూడు మూటలూ –అదే అంగడంటే! వుదయాన్నే లేచి, స్నానంచేసి, పక్కింటి వాళ్ళు విసుక్కునేలా గంటవాయిస్తూ పూజచేశాక, గబగబా రెండు ముద్దలు తిని, గల్లా పెట్టెముందు కూర్చునేవాడు మానాయన. అదే రోడ్డుపైన వైశ్యులదే యింకో కొట్టుండేది. అది మా అంగడి కంటే కొంచెం మెరుగ్గా వుండేది. మరికాస్త దూరంలో సాయిబుల అంగళ్ళు నాలుగైదుండేవి. అవి యెప్పుడూ మనుషులతో కిటకిటలాడేవి. మరికొంత దూరంలో కసాయంగళ్ళు

నాలుగైదుండేవి. అక్కడ తెల్లవారీ తెల్లవారక ముందే వేలాడదీసే మేకలూ పొట్టేళ్ళ మాంసం పదిగంటలకంతా ఖాళీ అయిపోయేది. వుదయం నుంచీ రాత్రి నిద్రపోయేవరకూ, మానాయన అంగట్లోనే కూర్చునేవాడు. "యెవరేవస్తువడిగినా లేదులేదంటే మన అంగడి కెవరొస్తారు?" అని మా అమ్మ అరిచేది. "నీ అమ్మగారింటి నుంచీ ముల్లె తెచ్చావా? పెట్టుబడికి దుడ్డెవరస్తారే!" అని మా నాయన చిందులేసేవాడు. వంటసరిగ్గా వండలేదని మానాయన, యింట్లో సరుకులు నిండుకున్నాయని మా అమ్మా, స్కూలుకుఫీజు కట్టలేదని మా తమ్ముడూ, కావల్సిందేందో కొనివ్వలేదని మా చెల్లెలూ, యిలా యెప్పుడూ యెవరోవొకరు మాయింట్లో గొడవచేస్తూనే వుండేవాళ్ళు. యీ గొడవలు పడలేక నేను మా యెదురింటికి పారిపోయేవాణ్ణి.

మాయిల్లు నరకమైతే నన్నూరు మస్తాన్‌వలీసాహేబిల్లు స్వర్గమని అర్థం. మాది చీకటి గుయ్యారంలా వుండే మట్టిమిద్దె. వాళ్ళది సున్నంతో కట్టిన మిద్దె. వర్షంవస్తే మా యిల్లంతా వురిసేది. గొడుగొకటి చేతబట్టుకుని మా నాయన యింటిపైకెక్కి కారుతున్న చోటల్లా సవుదు మట్టిని కాళ్ళతో తొక్కేవాడు. మస్తాన్‌వలీ సాహేబు వాళ్ళింటి ముందుండే వరండాలో చింతగుంట గుర్రపురౌతు టైలరు మిషను పెట్టుకుని బట్టలు కుట్టేవాడు. నడవా లాగుండే వాళ్ళ యెత్తుగోడల హాల్లో పై నుండే కిటికీల్లోంచీ కావలిసినంత గాలీ, వెలుతురూ లోపలికొచ్చేవి. ఆ యింటిగోడలు చలువరాతితో చేసినట్టుగా నున్నగా మెరుస్తూ వుండేవి. వాళ్ళ హాల్లో వుండే పొడవాటి గోడగడియారంలో లయ తప్పకుండా వూగే లోలకాన్ని చూడ్డమంటే నాకెంతో యిష్టంగా వుండేది. దానికిటూ అటూ పెద్దపెద్ద మక్కా మదీనాల ఫోటోలుండేవి. గుమ్మానికెదురుగా వుండే పటంలో వుర్దూ అక్షరాలన్నీ కలిసి నమాజు చేసుకుంటున్నట్టుగా వున్న అందమైన అమ్మాయి బొమ్మగా తయారైన తీరు యిప్పటికీ నాకాశ్చర్యాన్ని కలిగిస్తూవుంటుంది. ద్వారానికి వేలాడే గాజు వూసల తెర చెవులకింపుగా శబ్దంచేస్తూ కదలాడేది. ఆయింట్లో సామన్లన్నీ యెక్కడి వక్కడ బుద్ధిగా సర్దుకుని వుండేవి.

నన్నూరు మస్తాన్‌వలీ సాహేబుది దాదాపుగా మానాయన వయస్సు. అయినా అయినెందుకో నన్ను స్నేహితుడిలా చూసేవాడు. తన పిల్లలతో కంటే నాతోనే యెక్కువగా మాట్లాడేవాడు. నేను కాలేజీనుంచీ రాగానే పుస్తకాల్ని యింట్లో విసిరేసి, యెదురింటి కెళ్ళిపోయేవాణ్ణి. మస్తాన్‌వలీ సాహేబుకు యిద్దరు కొడుకులూ, యిద్దరు కూతుళ్ళూ. ఆయన పెద్దకొడుకు యెక్కడో యూనివర్సిటీలో చదువుతూవుండేవాడు. చిన్నవాడు యెలిమెంటరీ స్కూలుకెళ్ళేవాడు. పెద్దకూతురికి అప్పటికే పెళ్ళయింది. ఆమె అత్తవారింటి

నుంచీ వచ్చినప్పుడూ, తిరిగివెళ్ళేటప్పుడూ యింట్లో భలే సందడిగా వుండేది. మెడనిండా నగలు దిగేసుకుని, ముదురు రంగు బట్టలు తొడుక్కుని, ఆపైన తెల్లటి చద్దర్ కప్పుకుని ఆమె నడుస్తూంటే చూడ్డానికి రెండుకళ్ళూ చాలేవిగావు. యిక ఆ రెండో అమ్మాయుంది చూడూ, ఆమె గూడా ఆ అక్కలాగే తెల్లటితెలుపు. పొడుగ్గా నాజూగ్గా వుండేది. పెద్దజడ. చెవులకు బంగారు పోగులు. అప్పటికే హైస్కూలు చదువు ముగించుకుని రోజూ రెండు పూటలా ఖురాను చదువుతుండేది. మస్తాన్‌వలీ సాహేబు భార్య వాళ్ళ పిల్లలకు అక్కలా కనబడేది. ఆయన తల్లి ముదివగ్గు. అయినా యింటిపనుల్లో హుషారుగా తిరుగుతుండేది.

సాయంత్రాల్లో నేను వాళ్ళింటికెళ్ళే సరికి, మస్తాన్‌వలీ సాహేబు గోడకు చేరగిలబడి, అదేదో తపస్సు చేస్తున్నంత దీక్షగా బీడీగాలుస్తూవుండేవాడు. నేను వెళ్ళాక పైకిలేచి, యింటి బయటి కొచ్చేవాడు. వూరికి తూర్పుగా ఆయనకోటూరింగు టాకీసుండేది. అక్కడికెళ్ళే వరకూ ఆయన ఆ రోజు వాళ్ళింట్లో జరిగిన విశేషాలు చెబుతూవుండేవాడు. చివరకు ఆపూట ఆయన భార్యచేసిన కూర గురించి గూడా చెప్పేవాడు. టూరింగు టాకీసులో ఆరుగంటల కంతా గ్రామఫోను పాటలు పాడేది. ఆపరేటరు గదిలో కరీంసాహేబు సిన్మాఫిల్ముల చుట్టల్ని వెనక్కు తిప్పి ఫస్టుషోకు అనువుగా పెట్టుకునేవాడు. మస్తాన్‌వలీ సాహేబు ఆపరేటరుగది ముందుండే రాతి బెంచీపైన కూర్చుని వొకదాని వెంటవొకటిగా బీడీలు కాలుస్తూ వుండేవాడు. యేడు గంటలకు ఖాదర్బాషా, రఫీ టికెట్లు తీసుకుని కౌంటర్లలో కెళ్ళేవాళ్ళు. యెనిమిది గంటలకు సినిమా మొదలుపెట్టేదాకా నేను మస్తాన్‌వలీ సాహేబు పక్కనే కూర్చునే వాణ్ణి. తరువాత యిద్దరమూ తిరిగొచ్చేవాళ్ళం. మాయింట్లో నేను భోజనం చేసేశాక ఆయనతో బాటూ మళ్ళీ సినిమాటాకీసు కెళ్ళాలనే వాణ్ణి. అప్పటికే ఆలస్యమైపోయిందని మానాయన తిట్టిపోసేవాడు. అన్నంతిన్నాక కాస్సేపు పుస్తకాలు తిప్పుతున్నట్టుగా నటించేవాణ్ణి. జూనియర్ కాలేజీలో పరీక్షలు రాసేశాక నాకు రోజంతా తీరికే అయిపోయింది. వూర్లోని వాళ్ళంతా నన్ను మస్తాన్‌వలీసాహేబు పియ్యే అని పిలిచేవాళ్ళు. మాయింట్లో వాళ్ళు గూడా నాకా హోదాని ఆనందంగా కట్టబెట్టేశారు.

మస్తాన్‌వలీ సాహేబుతో తిరగడం వల్ల నాకు మావూర్లో కొన్ని అదనపు సౌకర్యాలు సమకూరాయి. ఆయన వూళ్ళో వుండే అయిదు మంది పెద్దమనుషుల్లో వొకడు. పెద్ద మనుషులు అయిదుగురూ పోకపోతే సాయిబుల కుటుంబాల్లో పెండ్లిళ్ళుగానీ, దివసాలుగానీ జరగవు. యేవైన గొడవలూ, మద్దిస్తాలూ జరిగినప్పుడు పెద్దమనుషులే న్యాయం చెప్పాలి. మస్తాన్‌వలీ సాహేబుతో బాటూ వెళ్ళినప్పుడు నాగ్గూడా మర్యాదలు జరిగేవి. చిన్నప్పుడు స్నేహితులయిండ్లకు వెళ్ళినప్పుడు మాంసం తినటం అలవాటైపోయింది. యిప్పుడు

మస్తాన్‌వలీ సాహేబుతో కలిసి వెళ్ళినపుడు విందుల్లో నాగ్గూడా బిర్యానీ పెడుతున్నారు. నేను తింటూంటే "యిందుకేరా మనూర్లో మటన్‌రేటు యింతగా పెరిగి పోయుండేది!" అని కొందరు గేలి చేసేవాళ్ళు. నేను పట్టించుకోకుండా నవ్వేసేవాణ్ణి. నేను మాంసం తింటున్న సంగతి మాయింట్లో వాళ్ళకు చాలా రోజులక్రితమే తెలిసిపోయిందని ఆ తర్వాతెప్పుడో తెలిసింది నాకు.

మా వూర్లోవుండే పది పన్నెండు హిందూ కుటుంబాలూ దీపావళికీ, సంక్రాంతికీ, వుగాదికీ పండుగలు చేసుకునేవి. మిగిలిన చిన్న చిన్న పండుగలప్పుడు గూడా రాముడి గుడికెళ్ళేవాళ్ళు. అయితే సరిగ్గా మనుషులు పోకపోవడంతో ఆ గుడెప్పుడూ వెలవెలబోయేది. రంజానుకూ, బక్రీదుకూ మావూరు వూరంతా మోతమోగి పోయేది. వుదయం చిన్నాపెద్దా అందరూ కొత్తబట్టలు తొడుక్కుని, సెంట్లు రాసుకుని యీద్గాకు పోవడం, యింటికొచ్చి గొంతుల వరకూ తినడం, బంధువులూ స్నేహితులూ వొకరి నొకరు కౌగలించుకుని 'యీద్ ముబారక్' చెప్పుకోవడం – అంతా కోలాహలంగా వుండేది. మస్తాన్‌వలీ సాహేబు నన్నుగూడా కౌగలించుకుని 'యీద్ ముబారక్' చెప్పడం మొదలుపెట్టాడు. క్రమంగా నేను గూడా రంజానుకూ, బక్రీదుకూ కొత్తగుడ్డ లేసుకుని, వాళ్ళందరితో బాటూ యీద్గా కెళ్ళేవాణ్ణి. వాళ్ళ నమాజు చదువుతూంటే నేను దూరంగా నిలబడి చూస్తూవుండే వాణ్ణి.

నా చిన్నతనంలో మావూర్లో మోహరం భలేధూంధాంగా చేసేవాళ్ళు. రోజూ పీర్లను వూరేంగింపు చేసేవాళ్ళు. హిందువులు గూడా యింటి ముందుకొచ్చిన పీర్లకు నీళ్ళుపోసి, బొరుగులూ, సాంబ్రాణీ, వూదుకడ్డీలూ పెట్టేవాళ్ళు. హజరత్తు బొరుగుల్ని మంత్రించి ప్రసాదంగా యిచ్చేవాడు. చివరగా మోహరం రోజున రంగులు చల్లుకునేవాళ్ళు. మొత్తం వూరు వూరంతా రంగుల్లో మునిగితేలేది. మొహరం నాటి రాత్రి పీర్లెత్తుకున్నవాళ్ళు నిప్పుల గుండం తొక్కేవాళ్ళు. అదెంత వేడుకగా జరిగేదంటే నేనిప్పుడు మాటల్లో చెప్పలేను. అయితే క్రమంగా ఆ పండగ చేయడం మానేశారు. పీర్లను పూజచేయడం హిందువులు చేసే పూజ లాంటిదే అనీ, దానికి ఖురాను వొప్పుకోదనీ, అందుకే ముస్లిములా పండగ చేయడం మానేశారనీ హిందువులు చెవులు కొరుక్కున్నారు, ఆపీర్లింకా పీర్లసావిడి అటకపైన అలాగే పడివున్నాయి.

నేనలా మస్తాన్‌వలీ సాహేబుతో బాటూ తిరుగుతూండగా, మా నాయనకోసారి జబ్బుచేసింది. దాన్నుంచీ ఆయన తేరుకోలేదు. ఆయన చనిపోయినప్పుడు మా వైశ్యులు చేసిన రభస యింతా అంతాకాదు. అదే ముస్లిములెవరైనా చనిపోతే, వాళ్ళెంత శుభ్రంగా, మౌనంగా, ఖబర్‌స్థాన్‌లో శవాన్ని పూడ్చేసి వస్తారో నాకు తెలుసు. కానీ మానాయన

శవంపైన మా బంధువులంతా పూలమాలలు కుప్పగా పడేసేశారు. మాలవాళ్ళూ, మంగలి వాళ్ళూ వీధిలో వాళ్ళవాళ్ళ వాయిద్యాల్ని పగల గొట్టినంతపని చేశారు. వెదురుకర్రలపైన గడ్డిపరిచి, దానికి మానాయన శరీరాన్ని దుర్మార్గంగా గడ్డిదారాలతో పెనవేసి కట్టేశారు. శ్మశానంలో కట్టేలుపేర్చి ఆయనను కాల్చేశారు. మరునాడు అక్కడికెళ్ళి బూడిదలో మిగిలిన యెముకల్ని యేరి తెచ్చి, నిమజ్జనంచెయ్యించారు. యింటికి పెద్దకొడుకునని నన్ను పదకొండు రోజులు యిల్లు కదలనివ్వకుండా చేసి, రకరకాల పూజలూ, వ్రతాలూ చెయ్యించారు. ఆ గొడవల్లోంచీ బయటపడేసరికి నాతలప్రాణం తోకకొచ్చింది.

మా నాయన పోగానే మా తమ్ముడు అంగట్లో గల్లాపెట్టె ముందు కూర్చున్నాడు. యీలోగా మా చెల్లెలి పెళ్ళి పనులు మొదలయ్యాయి. అదేసమయంలో మస్తాన్‌వలీసాహేబు రెండో కూతురిపెళ్ళి మావూర్లోనే వుండే మాస్నేహితుడొకడితో కుదిరింది. రెండువైపులనుంచీ ఖర్చు బాగానే పెట్టుకున్నారు. నిఖా అప్పుడు పెండ్లికొడుకు నూరేచష్మీకి పదివేలరూపాయల మెహర్ రాసిచ్చాడు. మా చెల్లెలి పెళ్ళి ఖర్చులన్నీ మేమేపెట్టుకోవాలనీ, కట్నం దండిగా కావాలనీ, వచ్చిన పెండ్లి కొడుకల్లా అంటున్నాడు. నేను క్రమంగా యింట్లో వుండడం తగ్గిపోయింది. కేవలం భోజనం చేయడానికి మాత్రమే యింటికి వెళ్ళేవాణ్ణి. రాత్రుల్లో యెదురింటి వరండాలోనే పడుకునేవాణ్ణి.

సరిగ్గా అప్పుడే వూర్లోవుండే హిందువులందరూ కలిసి శ్రీరామనవమి వుత్సవాలు చెయ్యాలనుకున్నారు! చందాపుస్తకాలు తీసుకుని వూరిపైన పడ్డారు. పోనీ పాపమని వూర్లోవుండే ధనవంతులైన ముస్లిములంతా చందాలిచ్చారు. మస్తాన్‌వలీసాహేబు గూడా నూటపదహార్లు రాసిచ్చాడు. వుత్సవాలప్పుడు వూరేగింపొచ్చిన దేవుడు, చందా లిచ్చిన ముస్లిముల యిండ్ల ముందు గూడా ఆగసాగాడు. కొందరు ముస్లిములు పోతేపోనీ అని దేవుడికి కొబ్బరికాయలు గూడా కొట్టారు. నాకైతే హుందాగా నిలబడిన ముస్లిములను చూస్తే ఆనందమూ, దీనంగా నిలబడిన హిందువులను చూస్తే కోపమూ వచ్చింది.

యీలోగా మా తమ్ముడు అప్పుచేసి మా చెల్లెలి పెండ్లి చేశాడు. మూడు నెలలకంతా యిచ్చిన కట్నం చాల్లేదని మా చెల్లెల్ని మాయింటికి తరిమేశారు. అప్పుడు మస్తాన్‌వలీ సాహేబుతో బాటూ పోలీసుస్టేషన్లకు తిరుగుతూ మాయింట్లో యేం జరుగుతూందో నేను పట్టించుకోలేదు. పోలీస్టేషనుకెందుకు తిరిగానని అడుగుతున్నావా? యెందుకంటే, ఆ సందర్భంలోనే మస్తాన్‌వలీ సాహేబు రెండో అల్లుడు ట్రాక్టరాక్సిడెంటులో చనిపోయాడు. కేసయింది. మేమలా తిరుగుతూ వుండగానే ఆరునెలలు జరిగిపోయాయి. యింతలో పక్కవూరి నుంచీ పెద్ద ముస్లిమొకాయనవచ్చి తనకొడుక్కు మస్తాన్ సాహేబు రెండో

కూతుర్ని నిఖాచేసుకుంటానని చెప్పాడు. అంతే! నెల రోజుల్లో ఆ అమ్మాయికి రెండో పెళ్ళి జబర్దస్తీగా జరిగిపోయింది.

యింటికి తిరిగొచ్చిన మా చెల్లెల్ని మళ్లీ అత్తగారింటికి పంపడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. యిన్నాళ్ళుగా పనిచేస్తున్న నాకు మస్తాన్‌వలీ సాహేబు జీతమేమిచ్చాడో చూపించమని మా అమ్మ నిలదీసి అడిగింది. ఆ మాట ఆనోటాయినోటాపడి చేరగూడని చోటుకే చేరింది.

"మాయింటి సంగతెట్లుందో నీకు తెలుసుకదా! పెద్దోడు యింట్లోనే కూర్చున్నాడు. సిన్మాటాకీసులో టికెట్లు అమ్మమంటే గూడా వినడు. చిన్నోడు స్కూలుకు సరిగ్గా పోడు. నా పెద్దకూతురి మొగుడికి యెంత దుడ్డిచ్చినా చాలదు. చిన్నకూతురు రెండుసార్లు పెండ్లి చేసుకోని వుండేదంతా వూడ్చుకోని పొయ్యింది. యింక నేను నీకు జీతంగా యిచ్చేదేముంది? మన యెమ్మెల్యేతో చెప్పి యేదయినా వుద్యోగం తీసిమ్మంటాను. ఆపైన నీ అదృష్టం" అన్నాడు మస్తాన్‌వలీ సాహేబు.

ఆ పని మాత్రం నేను చెయ్యమని అడిగానా యేమిటి? లేదే! ఆ తరువాత నేను మాయింట్లో భోజనం చేయడం గూడామానేశాను. మస్తాన్‌వలీ సాహేబు యెక్కడ భోంచేస్తాడో అక్కడేనేనూ! యింట్లో అయితే యింట్లో... బయటయితే బయటే!

"వుండే యిద్దరు చాల్లేదని వీన్ని గూడా దత్తత జేసుకున్నావా మస్తాన్‌వలీ!" అని వూర్లోవుండే పెద్దమనుషులు యెగతాళి చేసేవాళ్ళు. మకాను వీధిలో వుండే మునార్‌సాహేబు కూతురు పెండ్లికి పొయినప్పుడో సంగతి జరిగింది. బిర్యానీ తిన్నాక వక్కాకేసుకుంటూ వుండగా పెద్దమనిషి సత్తార్‌సాహేబన్నాడా మాట. యేమనీ?

"వీడు నమ్మకంగా నీ యెనకాలే తిరగతావుండాడు. వీనికి మనోళ్ళల్లోనే వొకాడబిడ్డను జూసి నిఖాజేసి, మనల్లోనే కలిపేసుకో గూడదా మస్తాన్‌వలీ!" అన్నాడాయన.

మస్తాన్‌వలీ పెద్దగా నవ్వేశాడు. నేను సిగ్గుపడిపోయాను. కానీ ఆమాట మాత్రం నాలో బలంగా నాటుకుపోయింది. మా బంధువుల అమ్మాయిలతో పోలిస్తే సాయిబుల ఆడపిల్లలు దేవతలమాదిరుంటారు. మా వాళ్ళకంటే దూదేకులసాయిబులు గూడా జమ్మని వెలిగిపోతా వుంటారు. యేకార్యానికైనా వూరంతా వచ్చి గుమిగూడిపోతారు. ఆపా, బా, భయ్యా, మామూ, దాదా, దాదీ, పుప్పూ అని వొకరినొకరు అల్లుకుపోతారు. మాయింట్లో యేదైనా విశేషం జరిగితే బంధువులు రైల్లూ, బస్సులూ మారి విసుక్కుంటూ యింటికొస్తారు. మా తమ్ముడూ, చెల్లీ నన్ను పట్టించుకోరు. నేను కనబడగానే మా అమ్మ తిట్టడం

ప్రారంభిస్తుంది. యీ నరకం నుంచీ బయట పడడానికో దారుందని నాకంతవరకూ తెలియలేదు.

మసీదుకెళ్ళి హజరత్తును పట్టుకుని యిది కుదిరే పనేనా అని అడిగాను. హజరత్తు నవ్వేశాడు. కానీ నేను విడిచిపెట్టలేదు. నేను మళ్ళీ మళ్ళీ వెంటపడేసరికి హజరత్తు యిలాకుదరదని మదరసా కెళ్ళివాకబుచేశాడు. "నిజం చెప్పు, అన్నీ జరిగాక జారుకుంటే కుదరదు. మేమేమీ నిన్ను అడగలేదు. నీ అంతట నువ్వే అడుగుతున్నావు. నీమాదిరి అడిగేవాళ్ళను కాదనగూడదని ఖురాను చెప్తావుంది. తర్వాత జరిగే వాటికంతా నువ్వే జవాబుదారీ" అన్నాడు మతవలీ. నేను మాటలతో సరే నంటే వాళ్ళొప్పుకోలేదు. చివరకు ఆమాటే కాగితంపైన రాసిచ్చాను. వాళ్ళు అయిష్టంగానే వొప్పుకున్నారు.

"సాబ్... అవుర్ యేక్ ఛాయ్." అంటూ హోటలాయన మళ్ళీ వచ్చి నాముందు నిల్చున్నాడు.

యిదివరకూ నేను ఖాళీ చేసిన టీగ్లాసు పైన యీగలు ముసురుతున్నాయి. యెదురుగా వీధిలో నాలుగేళ్ళ కుర్రాడొకడు పరిగెత్తుతున్నాడు. వాణ్ణి పట్టుకోవడం కోసం, వాళ్ళమ్మలా కనిపిస్తున్న స్త్రీ, వాడివెనకే పరిగెడుతోంది. ఖాళీ ఆటోవొకటి యెక్కడికో అయోమయంగా వెళ్తోంది.

మా యింటి వరండాలోకి రేష్మావచ్చి నిల్చుంది. నేను వులిక్కిపడి తిరిగి చూసి హోటలాయనతో "ఛాయ్‌లావ్!" అన్నాను.

## రేష్మాబేగం:

వీధిలో యెండ యెక్కువగా వుంది. కూరగాయలవాడు అరుచుకుంటూ వెళ్ళిపొయినాడు. తిరిగి యింటి లోపలి కొచ్చేసినాను. బయటికిపోవాలని తీసిపెట్టిన బురఖా యింకా అక్కడే అట్నే పడివుంది. స్కూల్ బేగ్ లేకపోయినందువల్ల అలమరా బోసిగా వుండాది. నెల దినాల దాకా యింట్లోనే వుండిన షఫీ యీ పొద్దే స్కూలుకు పొయినాడు. అందుకే యిల్లంతా బోసిపోతావుండాది. బేటా స్కూల్లో యెట్లుండాడో... పొద్దన నీరసంగానే వుండినాడు. ఆకిలయ్యిందేమో... రెండిడ్లీ మాత్రమే తినేసిపొయినాడు. మళ్లా యేమైనా టెంపరేచర్ వచ్చిందేమో! ఆ ఆలోచనవస్తానే నాకు వొళ్ళంతా వొణుకుడు పుట్టింది.

అదేం జొరమో, బిడ్డను నెల దినాల దాకా వుడకాడించేసి పొయ్యింది. డాక్టరు ముందు మలేరియా అన్నాడు. తర్వాత టైఫాయిడన్నాడు. పత్యం పెట్టినాడు. దినానికి పదిరకాల మాత్రలు మింగించినాడు. టానిక్కులు తాపించినాడు. జొరంపొయినట్టేవుంటా వునింది. యింతలో టక్కుమని వచ్చేస్తావునింది. బిడ్డ నెల దినాల్లో సగమయిపోయినాడు.

యింత హైరానా పెట్టిందంటే దానికి పెద్దకారణముంటాదని నాకు తెలుసు. తూర్పుకు మళ్లుకోని కూర్చోని, పద్మాసనమేసుకోని, జ్ఞాపకం తెచ్చుకునేదానికి చూసినాను. అప్పుడు అసలు విషయం జ్ఞాపకం వచ్చింది. హా! అవును. పెద్ద తప్పే జరిగిపొయ్యింది. యింక యిప్పుడైనా ఆ తప్పును తుడిచేసుకోవాల్ల... యిది ముషికిల్‌కామ్... షఫీ యెనిమిదిన్నరకు స్కూలుకు పొయినాడు. మా ఆయన పదిగంటలకు ఆఫీసుకు పొయినాడు. యింక ఆయన యింటికి తిరుక్కోని వచ్చేది సాయింత్రం ఆరుగంటలకే... యీలోపల నేను నాపని ముగించుకోవాల్ల.

మళ్లా వీధిలోకి పోయిచూసినాను. యెవురూలేరు.

యీసారి యింటి ముందుండే వీధిలోకి పొయ్యేధైర్యం లేదు. ఆ రోజు వేపమానువీధిలో నన్ను నిలేసినప్పటినించీ మా ఆయనకు నాపైన అనుమానంగానే వుండాది. అట్లా వూర్లోకి పొయ్యే సొస్తానని పొయ్యే మనిషి, యింతలోపల యింటికి తిరుక్కోని వచ్చేస్తా వుండాడు. రెండుమూడు రోజులదాకా రానని వూరికి పొయిన మనిషి, మర్సటిదినానికంతా వచ్చి, యినస్పెక్షను కాన్సిలయ్యిందని చెప్తావుండాడు. ఆయనకు దొరక్కుండా నాపని నేను చేసుకోవాల...

లోపలినుంచీ వీధి తలుపులకు గెడిపెట్టేసినాక, పెరడునుంచీ బయటికొచ్చి, వెనకతలుపులకు బీగమేసుకోని, కాంపౌండుగోడపైకెక్కి, అవతలి వీధిలోకి దిగేసినాను. కరెక్టుగా అక్కడొక ఆటో దొరికింది. మనం అనుకున్నంతమాత్రాన పనులు జరగవు. దానికి పైనుండే వాని అనుమతి గూడా దొరకాల. అప్పుడుమాత్రమే అన్నీ కలిసొస్తాయి. నేను పొయ్యే సరికి గుడిపూజారి వాళ్ళింటి మెట్లెక్కతా కనిపించినాడు. నేను పర్సులోనించీ అయిదు నూట పదహారు రూపాయిలు తీసిచ్చి "బిన్నాగా చేసెయ్యండి సామీ!" అని అడిగినాను.

ఆయన తలవూపుతూ, ముఖం చిట్లించుకోని, "వెళ్ళికుర్చో! నేను పదినిమిషాల్లో అక్కడుంటాను." అనినాడు. నేను బురఖాను ముఖంపైకి లాక్కున్నాక, గబగబా నడవసాగినాను. సుబ్రమణ్యస్వామి గుడి పక్కకొచ్చినాక, వేపచెట్టు వెనకుండే నీడలో

కూర్చున్నాను. యిప్పుడింక రోడ్డుపైన పోయేవాళ్ళకు నేను కనబడను. బురఖానుతీసి, చిన్నదిగా మడిచి పక్కన పెట్టుకున్నాను.

వేపచెట్టు పక్కనే చిన్న రావిచెట్టుకూడా పెరగతావుండాది. ఆ రెండు చెట్లచుట్టూ కట్టిన రచ్చపైన నాగదేవతల విగ్రహాలు కొత్తవిగా మెరస్తావుండాయి. రచ్చకాపక్కనుండే గుడి చానా చిన్నది. చుట్టూ వుండే యినపకమ్ముల గేట్లలోపలినించీ, దేవుడి ముందర అడ్డంగా దిగేసిన పరదా మాత్రమే కనబడతావుండాది. పరదా కీపక్కన పది యిరవైమంది మాత్రం కూర్చునేదానికి సరిపోయే హాలూ, దానికి నడీ మధ్యలో చిన్న నెమలి విగ్రహమూ వుండాయి. గుడిలోపలినించీ కర్పూరం వాసన భలే వస్తావుండాది.

పరదా వెనకుండే సుబ్రహ్మణ్యస్వామిని తలుచుకుంటే నాకు భలే బాధగా వుండాది. లేదా చెప్పు! మావూర్లో యెంత పెద్ద గుడిలో వుండే దేవుడీయిన! పెద్ద గోపురమూ, చుట్లా చిన్నచిన్న గుళ్లూ, గుడిబయిట పెద్దపెద్ద అంగళ్లూ, గుడిముందర పేద్ద యేనుగూ, కిందినించీ కొండపైకి రెండుమెట్లదారులూ, వొక బస్సుదారీ... రంగ రంగ వైభోగంగా వుంటాడీ దేవుడు మావూర్లో!

అసలు మావూరికెప్పుడైనా వచ్చినావా నువ్వు! మనిషిగా యీ లోకంలో పుట్టిన ప్రతి మనిషీ యెప్పుడోవొకప్పుడు మావూరికొచ్చి, మా దేవుడ్ని చూసేకావాల్ల! లేకపోతే అది బతుకేగాదు. అట్లాంటూరు మాది! తిరపతినించీ, చెన్నయికిపొయ్యే దోవలో తమిళనాడు బార్డరు దాటినాక పదిమైళ్ళలో వస్తింది మావూరు. పేరుకు తమిళనాడని పేరేగానీ మావూర్లోవుండే పెద్దోళ్ళంతా తెలుగే మాట్లాడతావుంటారు. మాయీడు వాళ్ళకు తెలుగురాసేదీ చదివేదీరాదుగానీ, మాట్లాడేది మాత్రం వచ్చు. నాకు బార్డరుకీపక్కనుండే మనిషితో నిఖా అయ్యింది గదా! మా ఆయిన వాళ్ళవూర్లో అందురూ వుర్దూ, తెలుగూ కలిపేసి మాట్లాడతారంట! మా ఆయనకు యీవూరికి ట్రాన్స్‌పరయ్యి మూడేండ్లవతా వుండాది. నేనిప్పుడు యీ వూర్లో వాళ్ళకంటే బాగా తెలుగు మాట్లాడతా వుండానని మా ఆయినంటావుంటాడు. అవునో కాదో నువ్వే చెప్పాల.

మావూరి గురించిగదా చెప్తావుండాను. చెన్నయికి పోయే దారిలో, పదిమైళ్ళ కివతలనించీ మాకొండపైనుండే సుబ్రమణ్యస్వామి గుడి కనబడతానేవుంటింది. ముందుగా వంకవస్తింది. అది దాటతానే వూరు. యేపక్కనించీ కొలిచినా రెండ మైళ్ళుంటాది మావూరు. అయినా వూరంతా తిరగాల్సిన పనేముండాది నాకు? మెట్లదోవ గుండా కొండపైకి పోవాలంటే మావీధిలో నించేపోవాల యెవురైనా. రోడ్డు టర్నయ్యే తావులో మొదులైన మావీధి కొండమెట్లవరకూ, మిట్టాపల్లాలతో

భలేగావుంటాది. వీధికి రెండు పక్కలా యిండ్లు. సరిగ్గా వీధి కొండపైకెక్కేటట్టుండే తావులో వుండాది మాయిల్లు. ఆపక్కా యీపక్కా యిండ్లన్నీ హిందువులవే. బాపనోళ్లయిండ్లు నాలుగూ, వైశ్యులవి అయిదూ, యింక మిగిలిన యిండ్లు రాజులవీ, బలిజోళ్ళవీ... వొక మంగలోళ్ళయిల్లూ, వొక చాకలోళ్ళ యిల్లూ గూడా వుండాయి.

మా 'బా' అసలు వూరు మావూరినించీ యిరవయ్యయిది కిలోమీటర్ల దూరంలో వుండే పెరియపాళెం. ఆవూర్లో యిప్పుడు గూడా మా తాయిబాలూ, పుప్పాలూ వుండారు. అయితే వాళ్ళతో మాట పట్టింపొచ్చి మా బా అలిగి, యీవూరికొచ్చి, యిక్కడ జవిలంగిడి పెట్టుకున్నాడంట... దగ్గిరోళ్ళంతా మోసం చేసినారు. 'సామీ, నువ్వేదిక్కు' అని కొండ మీందుండే దేవుడికి దండంబెట్టుకోని, గుడ్డల యాపారం ఆరంభంజేసినాడంట. అంతే! యింక తిరుగే లేదు. అంగిడి పెట్టుకున్న తావునే బేరంజేసి, అక్కడ్నే యిల్లు గూడా లేపేసినాడంట! మాయీధిలో వుండే వాళ్ళంతా మా అంగిట్లోనే గుడ్డలుకొంటారు. అంతేగానీ, యింకో అంగిడికిపోరు. పెరియపాళెం సిద్దేక్‌సాహేబంటే మోసముండదని పేరెత్తుకున్నాడు. అంతెందుకు? మాయింటికి పదిండ్ల కవతల నరసింహసామి గుడి చిన్న దొకటి వుండాది గదా! దాని పూజారి సత్యనారాయణసామి మా బా తెప్పించే పట్టు గుడ్డ లొచ్చేదాకా ఆదేవుడికి పాత గుడ్డలే కడతాడు. మా బా పొద్దన లేస్తానే, స్నానం చేసుకోని, నరసింహసామి గుడికిపోయి, ఆ పొద్దు మంచి టయమేందో, రావుకాలమెప్పుడో సత్యనారాయణసామి నడిగి తెలుసుకున్నాకే జవిలంగిడి తెరస్తావున్నాడు. యేదైనా యిబ్బంది వచ్చిందంటే, నర్సింహసామి గుడిలో అర్చన చెయ్యించి, శాంతి హోమం చెయ్యిస్తే చాలు, దాంతో ఆ యిబ్బంది తీసిపారేసినట్టుగా పోతావునింది. కార్తీక నెలలో కొండ కొచ్చే వాళ్ళు జాస్తీగా వుంటారు. అప్పుడు కొండకు నడిచిపొయ్యే వాళ్ళ కోసరమని మా 'బా' మెట్ల పక్కన చలివేంద్రం యేర్పాటు చేస్తావున్నాడు. భక్తుల కోసరం పెట్టిన ఖర్చుకు, రెండు రెట్లుగా జవిలంగిడిలో లాభం వస్తాదని మా అమ్మకు గూడా తెలుసు. దాంతో వొకటంటే రెండుగా సప్లయిలు జేస్తావునింది.

అసలు మా అమ్మకు నిఖా జరిగనాక అయిదారేండ్లవరకూ బిడ్డలే కలగలేదంట! అప్పుడు మా అమ్మ మండలం దినాలు కొండకు దినమ్మూ నడిచిపొయ్యి, దేవుడికి పూజలు చేసిందంట! మా బా నర్సింహసామి గుడిలో శాంతి హోమాలు చెయ్యించినాడంట. అప్పుడు గానీ నేను పుట్టలేదంట! నాయెనకాల్నే యిద్దురు ఆడబిడ్డలూ, వొకమగబిడ్డా పుట్టినారు. నాకేమో చిన్నప్పుడు వీధివీధంతా ఫ్రెండ్సే! అందుర్నీ తొడుక్కోని కొండమెట్ల పైన్నే ఆట్లాడతావుండేదాన్ని నేను. మా స్కూలు కూడా కొండకు పోయేదోవలోనే వుండాది.

అసలు కొండకు పొయ్యేటప్పుడు యే రకంగా యెక్కాల్నో వచ్చే పొయ్యే భక్తులకంతా నేర్పిస్తావునింది మేమే తెల్సునా? కొన్ని మెట్లెక్కతానే రంగమంటపం వస్తాది. దాంట్లో వొక నిమిషమైనా కుర్చోవాల. అదీ సాంగెం. పైకి పోతానే ముందుగా కొళాయి నీళ్ళతో కాళ్ళుకడుక్కోవాల. దేవుడి యేనుగు దూరం నించే తొండమెత్తి పిలిస్తింది. దానికేమో వొక అరటిపండో, కొబ్బరిచిప్పో యియ్యాల. దాన్ని తోలుకో నొచ్చే నటేశన్‌కు అర్ధరూపాయయినా యియ్యాల. గుళ్లో అప్పుడెంత రష్ వున్నా, స్వాములోళ్ళుమమ్మల్ని డైరెక్టుగా లోపలికి రమ్మనేస్తారంతే! గర్భగుడి ముందరుండే వినాయకసామికి దండంపెట్టుకున్నాకే లోపలికి పోవాల. మెయిన్ గుడిలో సుబ్రమణ్యసామి, అపక్కగుడిలో వల్లీ, యీపక్క గుడిలో దేవయానీ ముగ్గుర్నీ దర్శనం చేసుకున్నాక, బయటికొచ్చి, నేరుగా చెవుడు వినాయకుడి దగ్గిరికి పోవాల్ల. గుడికి వుత్తరం పక్కనుండే గోడపైనుంటాడా దేవుడు. ఆయనకు చెవుడు. దగ్గిరికి పోయి, ఆయన చెవుల్లోకి వొంగి, మనక్కావల్సింది కోరుకుంటే, యింక తిరుగుండదు. నువ్వేం అడగతావో అదిచ్చేస్తాడాయిన. అయితే మొక్కుకున్నాంక, ఆ మొక్కు తీర్చేయాల. లేకపోతే ఆయనకు కోపమొచ్చి, యిచ్చింది గూడా యెనక్కులాగేస్తాడు. అందుకని వొంటిమింద బయంపెట్టుకోని కోరాల్ల... గుడి నొక రవుండేసుకోని వస్తే ప్రసాదాల మండపం వస్తింది. లోపల ప్రసాదాలు అమ్మే సాములంతా మనకు తెలిసినోళ్ళేగదా! యే ప్రసాదం గావాలంటే అదిస్తారు.

కార్తీక నెలలో తిరుణాల చానాదినాలు జరగతాది. అప్పుడయితే పెరియపాళెం నించీ బంధువులంతా వస్తావున్నారు. మహా శివరాత్రికయితే యింక చెప్పాల్సినపనే లేదు. దీపావళీ, సంక్రాంతి, వుగాది పండగలకేగాదు, వైకుంఠయేకాదశీ, కృష్ణాష్టమిలకు గూడా మావీధిలో పండగలు భలే జరిపించేటోళ్ళు.

నేను పదో తరగతిలో వుండేటప్పుడు నాకు పెద్ద జొరం వచ్చింది. యెందురు డాక్టర్ల దగ్గిరికి తిరిగినా తగ్గలేదు. మా 'బా' యిట్లాగాదని సత్యనారాయణ సామి దగ్గిరికి పోయి, శాస్త్రం జూపించినాడు. ఆయన పంచాగం జూసి, లెక్కలేసి, అదేందో రాహుగ్రహదోషమని తేల్చిపారేసినాడు. మా బా కావల్సిన పూజసామగ్రంతా తెప్పించినాడు. ఆ పూజట్లా జరిగిందోలేదో, నేను జమ్మని లేచి కుర్చునేసినాను. అదీ ఆ దేవుడి మహత్యమంటే!

మా వూర్లో గూడా వొక చిన్న మసీదునింది. అక్కడంత బాగా మా పండగలు జరగవని మా బా మమ్మల్ని బక్రీదుకూ, రంజానుకూ పెరియపాళెం తొడుక్కోని పోతావున్నాడు. అయితే చుట్టుపక్కలుండే యిండ్లవాళ్ళంతా 'మా పండగలప్పుడు మా

యిండ్లకొచ్చి ప్రసాదాలు తింటారుగదా! మీ పండగలప్పుడు మాకు బిర్యానీ పెట్టకుండా పోతే న్యాయమా?' అని నిలదీస్తావున్నారు. ఆ తరువాత మా బా పండగలు మావూర్లోనే చేసేది మొదలు పెట్టినాడు. వొక సంవత్సరమయితే మా పక్కింటి తాత చచ్చిపోయిన రెండోదినానికే రంజానొచ్చింది. అట్లాంటప్పుడు మనం మాత్రం కౌసు తినేది మంచిదిగాదని మేంగూడా బిర్యానీ చేసుకోలేదు. వాళ్ళ అంటు పోతానే పక్కింటి మామి, వాళ్ళింట్లో వుగాదికి మేమంతా భోజనం చెయ్యాల్సిందే అని పట్టుబట్టింది. దగ్గిర బెట్టుకోకుండా తరిమేసినోళ్ళకంటే, అక్కరపడినప్పుడు ఆదుకునేటోళ్ళే నిజమైన బంధువులని మా బా చెప్పేటోడు. వీధిలో వుండే పెద్దోళ్ళనంతా, పాటీఅనో, అమ్మాఅనో, పెరప్పా అనో యేదో వొక వరసతో పిలవకపోతే మా బాకు భలే కోపం వస్తావునింది.

వొకసారి మా వీధిలో వుండే పెద్దోళ్ళంతా నల్లగుడ్డలు గట్టుకోని, యిరుముడి గట్టుకోని, శబరిమలకు బయల్దేరినారు. మా బా గూడా వాళ్ళతో గూడా శబరిమలకు పోయ్యేసొచ్చినాడు. శబరిమలలో అయ్యప్ప సామికి వావర్‌సామని సాయిబు ఫ్రెండుండాడంటలే! మా నాయినే చెప్పినాడు.

మా బా లావుగా, పొడుగ్గా, బలంగా రాతికంభం మాదిరుండేటోడు. కానీ యేమయ్యిందో తెలియదు. వొక దినం జవిలంగిడిలో కూర్చున్నోడు, అట్లనే యెనక్కువాలి పోయినాడు. అంతే! సత్యనారాయణసామొచ్చి చూసి బోరోమని యేడ్చేసినాడు. పుణ్యాత్ములకే అనాయాస మరణం, దేహీ అనకుండా బతకడం జరిగితిందని చెప్పినాడు.

మా బా చనిపోయినప్పుడు పెరియపాళెం నించీ వచ్చిన బంధువులంతా రెండు దినాలయిపోతానే తిరుక్కోని పొయినారు. అప్పుడు నేను ప్లస్‌టూ తో చదువుచాలించి యింట్లోనే వుండాను. మా తమ్ముడు పదిలో వుండాడు. నాకూ, మా పెద్ద చెల్లికీ వొకేసారి పెండ్లి చెయ్యొచ్చు. మా బా మిగలబెట్టిందేమీలేదు. మా ఆడబిడ్డలకు తలా యిరవయి సవరాలు నగలు మాత్రం చెయ్యించి పెట్టినాడు. యీ ఆడబిడ్డలకు పెండ్లెట్లవతాదని మా అమ్మ దిగులు పెట్టుకునేసింది. అంతా నర్సింహసామే చూసుకుంటాడని సత్యనారాయణ సామి ధైర్యం చెప్పినాడు. శాస్త్రం జూసి అదేందో హోమంజేసినాడు. అంతే! ఆయన చెప్పినట్టుగా ఆరునెలలకంతా వుత్తరంనించీ సంబంధం యెతుక్కుంటా వచ్చేసింది.

ఆ వచ్చిన పెద్దాయిన పేరు మస్తాన్‌వలీ సాహేబు. యిప్పుడు గూడా మాయింట్లో హాల్లో పెద్దఫోటో వుండాది, చూసినావు గదా! దాంట్లో వుండేది ఆయినే! మా యింటాయిన కంతకుముందు మూడు నెలలప్పుడే వుద్యోగం వచ్చిందంట! యిన్‌కంటాక్సు ఆఫీసులో అటెండరు. అది చాలకుండా వోపన్ యూనివర్సిటీలో బియ్యే చదవతా వుండాడంట.

'మంచి గ్రహబలముండే జాతకం. పెండ్లయిన రెండేండ్లకంతా ఆమె మొగునికి పెద్ద వుద్యోగం రాకపోతే నా పేరు మార్చి పెట్టండి' అన్నాడు సత్యనారాయణసామి. ఆ వచ్చిన పిల్లోడ్ని వాళ్ళ అమ్మానాయినా కాదనేసినారంట! యిప్పుడా మస్తాన్‌వలీసాహేబే తండ్రీ తల్లీ అన్నీ అంట! వాళ్ళు వలీమా మా ఆయన పనిచేస్తావుండే చిత్తూర్లో చేస్తామన్నారు. బ్రహ్మదేవుడెప్పుడో రాసిపెట్టేసుండాడు. యింక తప్పేదేముండాది? మా యింటి ముందరే షామియానా యేసి, దాంట్లోనే నిఖాజేసినారు. నిఖాకు మాయింటాయిన వాళ్ళ వూరినుంచీ చానా మందే వచ్చినారు. ఆ వచ్చినోళ్ళెవరో మా పక్కింటోళ్ళ చెవుల్లో గొణిగేసి పోయినారు. ఆ మాట మాదాకా వచ్చింది. మేమా సంగతి సత్యనారాయణసామికి చెప్పినాము. ఆయన మస్తాన్‌వలీ సాహేబునే అడిగినాడు. 'అవున్నిజమే! అయితే యిప్పుడువాడు నికార్సయిన సాయిబు. అంతా ఖురాన్‌లో చెప్పినట్టే జరిగింది. కావాల్సుంటే యే ముతవలీ నయినా అడిగి తెలుసుకోండి' అన్నాడాయిన. ముతవల్లీలు దాంట్లో తప్పేలేదని తేల్చిపారేసినారు. అప్పుటికే మా పెండ్లయి రెండు మూడు నెలలయి పొయ్యింది. అంతాపై నుండే దేవుడు ఆడించే ఆట! శివుడాజ్ఞ లేకుండా చీమైనాకుడితిందా?

నేనొకసారి మాయింటాయిన్ను యీమాటే అడిగినాను. ఆయన ముఖానికి గంటు పెట్టుకున్నట్టుగా మొట మొట లాడించినాడు. యిప్పుడు అల్లాను తప్పితే యింగొకర్ని నమ్మనని కరాకండీగా చెప్పేసినాడు. దినానికయిదు సార్లు నమాజు చెయ్యకుండా వుంటే చూపించమని దబాయించినాడు. ఖురానులో చెప్పినట్టుగా సున్తీజెయ్యించుకోని, పాకీగావుండి, పేరు మార్చుకున్న ఆరునెలల్లోనే వుద్యోగం వచ్చిందని ధీమాగా జెప్పినాడు. మస్తాన్‌వలీ సాహేబు తప్పితే ఆయనకింకో బంధువే లేడని తేల్చిపారేసినాడు. ఆపాత సంగతిని యింకోసారి గుర్తుతెస్తే గొమ్ముమండనని కసిరిపారేసినాడు. యీసంగతి యింగెవురికీ తెలయగూడదనే, యింతదూరం ట్రాన్స్ఫరు జేయించుకునేసినాడు. జాస్తీగా ముస్లిములే వుండే కాలనీలో యిల్లుబాడిగకు దీసుకున్నాడు. నేను మావూరినుంచీ తెచ్చుకున్న సుబ్రమణ్యసామి ఫోటో యెట్ల మాయిమైపోయిందో నాకింత వరకూ తెలియలేదు.

నిఖా అయినాక తొలీ శుక్రవారం నలుగులకు మావూరికి పొయినాము. ఆ మరుసటి దినం నేను గుడికి బయల్దేరినాను. యెమ్మట్నే మా యింటాయిన నిప్పుల గుండం తొక్కేమనిషి మాదిరిగా గగ్గోలు చేసేసినాడు. కావాలంటే నాగూరు దర్గాకో, కస్మూరు దర్గాకో తొడుక్కోని పోతానుగానీ, గుడికి పోతే గొమ్ముమండనని రచ్చరచ్చజేసేసినాడు. మా యింటాయినకు గుళ్ళంటే, దేవుళ్ళంటే యెందుకంత కోపమోనాకు అర్థం గాదు. యెప్పుడామాట యెత్తినా యెగిరిదూకతాడు. యింట్లో పడుండే ఆడది, మొగోనిమాటే

యినాలంట! అనవసరంగా వాదనలు పెట్టుకోగూడదంట! యెందుకు చెప్తావులే! కొట్టేది తప్ప మిగిలిన అన్ని శాంతులూ జరిగినాయినాకు! 'యీ చిన్న విషయంలో తప్ప మిగిలిన వాటిల్లో మంచోడేగదా! సర్దుకోనిపో!' అంటింది మా అమ్మ. కానీ నాకేమో మావూరికి పోతానే కొండెక్కి సుబ్రమణ్యసామిని చూడాలని వుంటింది. నర్సింహసామి గుడికిపోయి సత్యనారాయణసామితో మాట్లాడాలని వుంటాది. నేనేమైనా ఆవైపుకు పోతానేమోనని మా యింటాయిన కాపలాగాసేది మొదులుబెట్టినాడు.

నాకు పెండ్లయిన ఆరేడు నెలలయినాక వొకతూరి నాకెందుకో పెద్ద కడుపునొప్పి వచ్చింది. యేడాక్టరు దగ్గిరికి పోయినా కుదర్లేదు. నిఖా అవతానే నర్సింహసామిగుడిలో వుభయం యిస్తానని మొక్కుకున్న సంగతి నాకప్పుడు గుర్తుకొచ్చింది. మా తమ్ముడిదగ్గర రహస్యంగా అయిదునూర్లిచ్చి, నాపేరు పైన వుభయమియ్యి మని చెప్పినాను. ఆ పనిజరిగినాకే నా కడుపు నొప్పి తగ్గింది. ఆ గుడిలో యిన్నూరు రూపాయలు హుండీలో యెయ్యించినాకే, నా బదులుగా మా అమ్మ మొక్కుకున్నాంకే, నాకడుపులో బిడ్డపడినాడని మాయింటాయిన కింతవరకూ తెలియదు.

రోడ్డుపైన ఆటో వొకటి పెద్దగా హారను మోగించుకుంటా పోతావుంది. నాగ్గూడా ఆకిలిగా వుండాది. నెలదినాల తరవాత యీరోజు స్కూలుకు పోయినాడు నాకొడుకు. అదేం జబ్బో, బిడ్డను నెలదినాలుగా యేడ్పించేసింది. సగమయిపొయినాడు. డాక్టర్లు యేదేదో పేర్లు చెప్పి, యేవేవో మందులిచ్చినారు. అయినా మందులతో జబ్బు కుదిరితిందా? బిడ్డపుడతానే గుడిలో సంతర్పణజెయ్యిస్తానని మొక్కుకున్నాను. అది తీర్చనేలేదు. వేపమానువీధిలో వుండే యీ గుడికొచ్చి, హుండీలో పదిరూపాయలేసి, నాబిడ్డకు గుణమవతానే, సంతర్పణజెయ్యిస్తానని మొక్కుకున్నాను. అంతే! వారందినాల్లో జొరం తగ్గిపొయ్యింది. మొక్కు తీర్చాలగదా! మా యింటాయిన దసలే దొంగకండ్లు. యెప్పుడూ నాపైన దొట్టే! యీ గుడి పూజారెవుడో భలే చాదస్తంగా వుండాడు. సంతర్పణ చేసేదానికి కావల్సిన డబ్బంతా యిచ్చేసినాను. సంభావన గూడా యిచ్చేసినాను. వంటలన్నీ యెక్కడ్నో వండించి తెప్పిస్తానన్నాడు. గుడి ముందు యీ రోజు సంతర్పణ వుందని బోర్డుగూడా రాసినాడు. నేను నాలుగైదుసార్లు హెచ్చరించినాకే బోర్డుపైన వుభయదారుగా నాపేరు రాయలేదు. పొరబాటున మా ఆయన చూసినాడంటే యింకేమైనా వుండాదా చెప్పు!

గంట వొంటిగంటవతావుండాది .వండిన బోజనాలు రాలేదు. పూజారీరాలేదు. బీదవాళ్ళు కొందరు గుడిముందర యెండలోనే యెదురుచూస్తావుండారు. యీ పూజారొచ్చే

దెప్పుడు? నా చేతుల్తో నేను సంతర్పణ చేసేదెప్పుడు? యీ పనంతా ముగించుకోని నేను యిల్లు చేరేదెప్పుడు?

**షఫీ:**

స్కూలు బాగెత్తుకుని, బా స్కూటరుపై నుంచీ దిగి, యింట్లోకి పరిగెత్తాను. బయటికి రాబోతున్న అమ్మకాళ్ళకు చుట్టుకుని "మా! ఆకలి...ఆకలి" అని అరిచాను.

అమ్మ నా భుజాలపై నుండే స్కూలు బాగ్ తీసి పక్కనపడేసి, నన్నెత్తుకుని "యింత లేటయిందేం బేటా?" అని అడిగింది.

"మరి... మా... మరి..." అంటూ నేను నా ముఖాన్ని మా అమ్మ ముఖాని కానించాను. అమ్మ బుగ్గలు తడి తడిగా తగిలాయి. అమ్మ ముఖంలో ముఖంపెట్టి చూశాను. ఆమె కళ్ళలోంచీ కన్నీళ్ళు జలజలారాలుతున్నాయి.

"యెందుకింత లేటయింది బేటా!" అంది అమ్మ మళ్లీ.

"చెప్పరా చెప్పు" అని కసురుతూ బా యింట్లోపలి కొచ్చాడు.

"నాకు ఫీవరు తగ్గిందని మాఫాదరు ప్రేయరు జేసినాడు. క్లాస్ అయిపోయినాక మేమంతా ప్రేయర్ హాలుకు పొయినాం" అన్నాను.

"చూశావా! యెలా తయారౌతున్నాడో వీడు!" అంటూ మా బా వురిమిచూశాడు. "నిన్నెవురు క్రిస్టియన్ల ప్రేయరుకు పొమ్మనార్రా?" అని గదమాయించాడు.

"ప్రేయరు చాలా యింపార్టంట్ డాడీ! ప్రభువు దయామయుడు" అంటూ నేను మా ఫాదర్ చెప్పిన మాటలే గుర్తుచేశాను.

బా కుర్చీలో దభేలుమని కూర్చుని "యెవరన్నార్రా ఆ మాట!" అని కసిరాడు.

"మాఫ్రెండు బంటీ భర్త్‌డే అప్పుడు ఫాదర్ ప్రేయరు చేసినాడు. సంతోష్‌కు ఫీవరొచ్చినప్పుడు గూడా ప్రేయర్ చేసినాడు. అందుకే వానికి తగ్గింది. నాకు ఫీవరుందని బన్నీ ఫాదర్‌కు చెప్పితే, ఫాదరప్పుడు ప్రేయరుజేసినందుకే..." మా బా ముఖం చూస్తూ చెప్పడం ఆపేశాను.

"వీడా స్కూల్లో యేంచేస్తున్నాడో చూసుకోవల్సిన పని నీదా నాదా?" అని అరుస్తూ మా బా అమ్మను కొట్టేలా చూశాడు. వెంటనే మా అమ్మ నన్ను దగ్గరికి లాక్కుని "మనం క్రిస్టియన్ల ప్రేయరుకు పోగూడదు బేటా!" అంది.

"అది గాదమ్మా! డైలీ మార్నింగ్ మా స్కూల్లో మేమంతా ప్రేయర్‌చేస్తాం. అందుకే మాస్కూల్లో స్టూడెంట్లకు మిగిలిన స్కూల్స్‌లో వుండేవాళ్ళకంటే బాగా మార్కులొస్తాయి.... తెల్సునా?" అన్నాను.

"యెవరన్నార్రా ఆమాట?" మా బా మళ్ళీ కోపంగా అరిచాడు.

"యింకెవరు డాడీ! ఫాదరే! అస్సలు యెప్పుడు భోజనం తినాలన్నా ముందుగా ప్రేయరు చేసినాకే తినాలంట! ప్రభువు అందరి బదులుగా కష్టాలు పడినాడంట!" అన్నాను నేను ధైర్యంగా.

"వద్దు వద్దంటే ఆ సెయింట్ తెరిస్సా కాన్వెంటులో చేర్చమన్నావు. యిప్పుడుచూడు, యెలా తయారుయ్యాడో!" బా నన్ను వురిమురిమీ చూస్తున్నాడు.

"కాన్వెంటు క్రిస్టియన్లదే అయినా స్టూడెంట్లు యెక్కువ మంది హిందువులేగదా! పిల్లకాయలకు వాళ్ళు వాళ్ళ ప్రేయర్లు నేర్పించేదేం న్యాయం? యిట్లా జరగతావుంటే పారెంట్సంతా యెందుకు గొమ్మునుండారు?" మా అమ్మగూడా విసుక్కుంది.

"యిక నేను నీ మాట వినను. వీణ్ణి ఆ కాన్వెంటు నుంచీ తీసి వేరే కాన్వెంటులో చేర్పించేస్తాను" అన్నాడు బా.

"అయ్యో! యీ వూర్లో వుండే కాన్వెంటుల్లో బాగా పాఠాలు చెప్పే కాన్వెంటు అదే అని అందురూ అంటారు. బిడ్డకు చదువొచ్చేదే గదా ముఖ్యం" మా అమ్మగొంతెందుకో మూల్గుతున్నట్టుగా తయారయ్యింది.

"నేను వేరే కాన్వెంటుకు పోను. యిక్కడైతే బంటీ, బన్నీ, సంతోష్ అందురూ వున్నారు." నేను మొరాయించాను.

"చదువు రాకపోయినా పర్వాలేదు. రేపే వేరే కాన్వెంటులో చేర్పించేస్తాను. యెక్కడ యీ పాడూ ప్రేయర్లూ గ్రీయర్లూ వుండవో, ముందుగా తెల్సుకోని, ఆకాన్వెంటులోనే చేర్పిస్తాను." మా బా నన్ను కొడతానన్నట్టుగా చేయివిసురుతూ అరిచాడు.

నాకు యేడుపు వస్తోంది.

బంటీ, బన్నీ, సంతోష్ లేని కాన్వెంటుకు నేనెందుకుపోవాలి చెప్పు. నేనుపోను... అయినా యిప్పుడేం మిస్టేక్ జరిగింది? మా బా కూ, అమ్మీకీ యెందుకింత కోపం వచ్చింది? నాకేమీ తెలియడం లేదు. కానీ వేరే కాన్వెంటు కెళ్ళాలంటే మాత్రం యేడుపొచ్చేస్తావుంది.

ఆగస్టు 2010 సురభి మాసపత్రిక